

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 1-

(ప్రారంభం)

పాఠకుడా ! నేనెవరినో తెలుసా?

శ్రీనివాసోభిరక్షతు! చదువరీ నీకు శుభమస్తు! నేను నీకు తెలుసా? తెలుసును కానీ, తెలుసునని నీకు తెలియదు అంతే! నువ్వు నాకు చాలా బాగా తెలుసు. నువ్వేమిటి, నీ తండ్రి, ఆయన తండ్రి, ఆయన తండ్రి తండ్రి, అందరూ తెలుసు నాకు. ఎందరిని చూశాను! ఎన్ని చూశాను! ఎందరికోసం ఎదురు చూశాను! ఎన్ని దుఃఖాశ్రువులు మోశాను? ఎన్ని మధుర గీతికలు మ్రోశాను? ఇప్పటిదా? నా వీక్షణ, నిరీక్షణ, పరీక్షణ, ఎన్ని యుగములది. ఇంకెన్ని యుగములు చూస్తాను! ఇవన్నీ నాకు లిప్త మాత్రములు! నేనెవరికోసమూ ఆగలేదు, ఆగను. సాగిపోతూనే ఉంటాను. మధ్యమధ్యలో పలుకరిస్తాను, ఆగ్రహిస్తాను. బ్రతికిస్తాను, బ్రతుకులను బండలూ చేస్తాను.

నా కథ చెప్పుకుంటున్నానా, కాదు కమనీయమైన యదార్ధ గాథలు చెబుతున్నాను. నేను నేపథ్యములో ఉంటూనే కొన్ని సత్యములను చెబుతున్నాను. కొన్ని మిథ్యలను తేట తెల్లములు చేస్తున్నాను. కొన్ని రహస్యములను దాచి దాచి నా గుండె బరువెక్కింది, కొద్దిగా దానిని తేలిక

పరుచుకుంటాను! ఒళ్లంతా చెవులు చేసుకో. చెవులలో కాల రహస్య సారమంతా నూరిపోస్తాను. విని విషయమును గ్రహిస్తావో, విజ్ఞతతో చరిస్తావో, నీ ఇష్టము. కల్లలను నిజాలుగా భ్రమిస్తావో, విశృంఖలంగా పరిభ్రమిస్తావో, నీ స్వేచ్ఛ!

నేను ఎంతటి పవిత్ర చరిత్ర గలదాననో తెలుసా? మహాగణపతికి మ్రొక్కి, కాశీవిశ్వేశ్వరుని మరులకు జిక్కి మత్తెక్కించుకున్నాను. దత్తాత్రేయుని దయను దక్కించుకున్నాను. దక్షిణానికి దృక్కులు నిగిడించాను. బసవని భవ్యమైన పలుకులతో సంగమించాను. మల్లన్నకు మోకరిల్లాను. నరసింహునికి నతులుజేసి మురిశాను! శాక్యముని స్మృతుల గంగలో తడిసి, కాలచక్ర వైభవాల సుడులు తిరిగాను. శాతవాహన శౌర్య ధారలనూ చవిజూశాను. దుర్గమాలను సుగమాలుగా మలిచిచే దుర్గమ్మ పదములను స్పృశించాను. పరమహంసల పరిష్వంగములో పరవశించాను.

అగాధమైన గాథ నాది. అనన్య సామాన్యమైన వీథి నాది. పుణ్యపురుషుల వినోదాల పునాది నాది. తెలిసిందా నేనెవరినో, అయితే నువ్వు ధన్యుడివి. తెలియలేదా? బాధ పడకు, నిన్ను ధన్యుడిని చేసే బాధ్యత నాది. అందుకే ఈ కథ చెబుతున్నాను. ఒళ్లంతా చెవులు జేసుకో, చెవులలో కాలరహస్య సారమంతా నూరిపోస్తాను, విని విషయమును గ్రహిస్తావో, విజ్ఞతతో చరిస్తావో నీ ఇష్టము. వద్దని విశృంఖలంగా పరిభ్రమిస్తావో, గతం శూన్యమని, చరిత్ర దైన్యమని, భవిత హైన్యమని భ్రమిస్తావో, నీ స్వేచ్ఛ! కానీ , మరలా చెబుతున్నా, నన్ను తెలుసుకో, నిన్ను తెలుసుకో, మనంతటి వాళ్ళు లేరని తెలుసుకో. తెలుసుకుంటావా? నాతో రా మరి! ఎంతో కాదు, నాలుగువందల సంవత్సరాల వెనక్కు నిన్ను తీసుకుపోతా. భయపడకు. మరలా నిన్ను ఇక్కడికే తెచ్చి దింపుతా. కాల రహస్య మధువు నీకై అంతా ఒంపుతా. భావి పాత్రలో అనన్య సత్యముల అమృతం నింపుతా, తాగి అమరుడవు అవుతావో, వలదని జీవన్మృతుడవు అవుతావో, నీ ప్రాప్తం! సరే! ఇక్కడే కాలాయాపనమెందుకు, వెళ్దాం రా!

అశ్వము – అశ్వికుడు – నలనామ సంవత్సరము– క్రీ.శ. 1677

శీఘ్రగతితో ఆ మేలుజాతి అశ్వము పరుగిడుతున్నది. అశ్వజాతి అందమంతా ఒక్కటై పరుగెడుతున్నదేమో అన్నట్లు, విశ్వసనీయముగా పరుగెడుతున్నది. స్ఫుటంగా ద్యోతకమౌతున్న విశ్వాసముతో పరుగెడుతున్నది. వేగముగా వెనక్కు పరుగులుపెడుతున్న కొండరాళ్ళ మీద దాని డెక్కల చప్పుడు మధురంగా గంభీరంగా ప్రతిధ్వనిస్తున్నది. ముదురు గోధుమవర్ణములో, ముందుకు సాగిన మెడతో, నాలుగు కాళ్ళమీద సమానమైన పట్టుతో ముందుకు దూకుతుంటే వడిగా సాగుతున్న గోదుమవన్నె త్రాచులా తళతళ మెరిసిపోతున్నది. చెవుల చివరల, నుదుటిమీద, తోకమీద,తొడలమీద, పిక్కల మీద తెల్లని మచ్చలు దాని గోధుమ వన్నెను మరింతగా ప్రకాశింపజేస్తున్నాయి. వేగపు శ్రమచేత నోటినుండి వెలువడుతున్న నురగలు దాని శరీరం మీద అక్కడక్కడ పడి మెరుపుల్లా వెలిగి గాలి తాకిడికి అంతలోనే కనుమరుగువుతున్నాయి. తల విదిలిస్తూ గాలిని చీల్చుకుంటూ ధనుస్సునుండి వెలువడ్డ సునిశితమైన బాణంలా లక్ష్యము వైపు దూసుకుపోతున్నది. బలంగా బిగించిన కళ్ళాల రాపిడికి దాని దవడలు పూచిన దానిమ్మ రంగులో వింత శోభను వెలువరిస్తున్నాయి. కనులు మూసుకుని సర్వాంతర్యామిని చూస్తున్న యోగిలా, దిగంతముల వెనుక నుండి ఏదో దివ్యశక్తిలా అంతా చూస్తున్నట్టుగా పరుగెడుతున్నది. నిక్కబొడిచిన చెవులతో తన డెక్కల ధ్వనులను, ప్రతిధ్వనులను, ప్రకృతిలోని ధ్వనులను వింటున్నట్టు పరుగెడుతున్నది. నింగినుండి జారుతున్న తోకచుక్కలా ఆ అశ్వము మునుముందుకు సాగుతున్నది. అశ్వధాటి అద్భుతంగా ప్రకృతిని అలుముకుంటున్నది.

తెల్లని వెలుగులు చిమ్ముతున్న ఆకృతి ఒకటి దానిని వెన్నంటి వడిగా సాగుతున్నది.

దానిని వెన్నంటి వస్తున్న ఆ దివ్యమైన తేజస్సు త్రుటిలో ఆ అశ్వాన్ని అధిగమించే వేగమును కలిగినప్పటికీ తన వేగాన్ని తానే నిరోధించుకుని ఆ అశ్వాన్ని అలవోకగా అదృశ్య శక్తిలాగా అనుసరిస్తున్నది. కొండల మధ్యనున్న యిరుకైన మార్గం గుండా అశ్వము దూకుతూ పరుగులుపెడుతుంటే వెన్నంటి వస్తున్న ఆ తేజస్సు వెలుగుల రాశి తీగసాగినట్లు అనుసరిస్తున్నది. ఆ తేజస్సు ఒక ప్రవాహపు ఉరవడిలా నురుగుల పరవడిలా శ్వేత వర్ణములో ఉంది. దాని ప్రకాశము ప్రతిఫలించి, బాటప్రక్కనున్న బండరాళ్ళు చటాలున ఒక మెరుపు మెరిసినట్లు తెల్లగా వెలిగిపోతూ వేగముగా కనుమరుగైపోతున్నాయి.

ఒక పిడికిటిలో కళ్ళెములను, పిడిబాకును ఒడుపుగా బిగించి పట్టుకుని ఉన్నాడు బలిష్టమైన అశ్వికుడు. మరొక చేతిని నడుముకున్న ఒరపై సిద్ధముగా ఉంచుకున్నాడు. ఏ క్షణములో నైనా దీర్ఘమైన కరవాలమును దూయడానికి సన్నద్ధుడై కనిపిస్తున్నాడు. మధ్యమధ్యలో తన తలపాగాను

సవరించుకుంటూన్నాడు. అశ్వపు వేగానికి కదలికలకు అనుగుణంగా తన శరీరాన్ని మలుచుకుంటూ, వంచుతూ, ఒరుగుతూ నేర్పుగా స్వారీ చేస్తూ నిశితముగా చుట్టూ పరికిస్తూ పయనం కొనసాగిస్తున్నాడు. దృఢమైన దవడ ఎముకలు, ఎత్తైన విశాలమైన నుదురు, గుబురైన కనుబొమలు, యేవో లోతులను శోధిస్తూన్నట్లున్న కొద్దిగా నీలిరంగులోవున్న కండ్లు, కొనదేలి వంపుతిరిగిన నాసిక, పసిమిఛాయలో కందిపోయినట్లున్న శరీర వర్ణం, దీర్ఘమైన బలమైన శరీర నిర్మాణమునుబట్టి మధ్య భారతదేశపువాసి అని యిట్టే తెలుసుకోవచ్చు అతడిని చూసి. ఆతని బలిష్ఠమైన భుజములపై చుట్టి వున్న వంగపండు రంగులోనున్న ఉత్తరీయము రెండుప్రక్కలా గాలికి ఎగురుతుంటే, ఎగురుతూ పోతున్న రెక్కల గుర్రంలాగా ఉన్నది. దాని డెక్కల వేగానికి ఎగిరిపడుతున్న చిన్ని చిన్ని రాళ్ళూ, ధూళి, లయబద్ధముగా ఏదో గంభీర దీర్ఘ గీతికలాగా వినబడుతున్న ఆ గిట్టలధ్వని, యివి మాత్రమే అది నేలపై పరుగులు తీస్తున్నది అనడానికి సాక్ష్యములు.

ఆ అశ్వము ముందుకు సాగుతున్న కొద్దీ అది దాటివచ్చిన నిర్జన అరణ్యప్రాంతం వెనక్కు జారిపోతున్నది. క్రమక్రమంగా మారిపోతున్నాయి పరిసరాలు. పొడవైన విశాలమైన అనేక జాతుల మహా వృక్షముల స్థానములో దట్టమైన పొదలు, అక్కడక్కడ కొన్ని చిరు వృక్షాలు ప్రత్యక్షమవుతున్నాయి. అవికూడా వెనక్కు జారిపోయి చిరు పొదలు, తుప్పలు, అడవి తీగలు గోచరమై అంతలోనే కనుమరుగైపోతున్నాయి. దూరముగా జనావాసాల ఛాయలు గోచరిస్తున్నాయి. బాటకు యిరుప్రక్కలనున్న కొండల మధ్య, పొదలకు వెనుక దూరంగా కనబడుతున్న భూములు సాగుబడిలో ఉన్న సాక్ష్యముగా గూళ్ళు కట్టిన వరిధాన్యపు కుప్పలు కనిపిస్తున్నాయి. అవి కృషీవలుల గుండెలు కట్టిన గుడులలాగా కనిపిస్తున్నాయి.

మాఘమాసపు తొలిరోజుల మాగాణుల చెమ్మను పూసుకున్న గాలులు వీస్తున్నాయి. మట్టి వాసనను, మధ్య మధ్య ఇంకా నూర్చని వరికంకుల వాసనలను మోసుకుని వస్తున్నాయి. రాబోయే వసంతపు జాడలు లీలగా తెలుస్తున్నాయి. వీడిపోయిన హేమంతపు చిరుచలుల వింజామరలు కొద్దికొద్దిగా వీస్తున్నాయి. దూరంగా అక్కడక్కడ కొద్దికొద్దిగా రేగుతున్న శిశిరపు గాలికి వూగుతున్న చెట్లూ చేమలూ, చెలరేగుతున్న అడవిపక్షుల చిన్ని చిన్ని కూతలు, బాట మీద ఎగురుతున్న చిన్ని చిన్ని ఆకులూ, పాల పిట్టలు, వుండీ వుండీ కొమ్మనుండి కొమ్మకు ఎగురుతున్న చిలుకలు బాటసారికి స్వాగతంగా ఎదురేగుతున్నట్లున్నాయి. ఇప్పుడు బాట కొద్దిగా చదునుగా, విశాలముగా, మెత్తగా మారుతున్నది. బాటమీద వేగముగా ఆ అశ్వము దూసుకుపోతుంటే ఇరుప్రక్కలా పొలాల నుండి ఇళ్ళకు మరలుతున్న జానపద స్త్రీ పురుషులు ఆ మేలుజాతి అశ్వానికి, వీరోచితమైన రూపంలో కనిపిస్తున్న ఆ అశ్వికునికి స్వాగతముగా ఊరేగింపుగా వెన్నంటి నడుస్తున్న బృందములా కనిపిస్తున్నారు.

సాయం సంధ్య సమీపిస్తున్నది. మరొక రేపటిపై ఆశతో నేటిని త్వరగా ముగించడానికి పడమటి కొండలకు పరుగులు పెడుతున్నాడు దినకరుడు. అంతకంతకూ ప్రకృతి వేగముగా రంగులు మారుస్తున్నది. ఇంతకుముందే కాగుతున్న బంగారపు రంగులో ఉన్న పరిసరాలు ఇప్పుడు కెంపురంగులోకి మారిపోయాయి. ఇంతలోనే ఎరుపూ నీలిమా కలగలిసి వంగపండు వర్ణములోకి మారిపోతున్నాయి. ఇప్పుడు లేత నీలి వర్ణమే తెలుస్తున్నది. ఇప్పుడిప్పుడు ఇంద్రనీల వర్ణములు గోచరిస్తున్నాయి దిగంతాలలో. ఆ నీలి శోభలు నీడల్లా పాకుతూ సృష్టిని ఆక్రమించుకుంటుంటే క్రమక్రమంగా దృశ్యములు అస్పష్టతను సంతరించుకుంటున్నాయి. పొద్దు వాలుతున్నది. చిక్కని చీకటి కంబళికప్పి జీవులనే పిల్లలను నిద్రబుచ్చడానికి రాత్రి అనే తల్లి త్వరపడుతున్నది. పడమటింటికి మరలుతున్న దినపతికి, తన పతికి పరచడానికి చుక్కల రెక్క దుప్పటితో, పంచడానికి వయసు వెన్నెలతో రాత్రి కాంత సంసిద్ధయై ఉంది. నీలిమేఘముల సిగలో జాబిలి చెండును ముద్దబంతిలా ముడుచుకుంటున్న ముసిముసినవ్వుల ముగ్ధలా ఉంది. ముద్దుగా ఉంది.

పరిసరాలను పరికిస్తూ వడిగా సాగుతున్న అశ్వికునికి అల్లంత దూరంలో మలుపు తిరుగుతున్న బాట కనిపించింది. మలుపుకు అటూ ఇటూ రెండు పెద్ద కొండలు కనిపిస్తున్నాయి. వాటిమధ్యనుండి విశాలమైన చెరువు కనిపిస్తున్నది. అది అతని కనులకు అస్తమిస్తున్న సంధ్యాసమయపు సిందూర వర్ణమును తన నీటి నీలిమతో రంగరించి ఆవిష్కరించిన అద్భుత తైలవర్ణ చిత్రములాగా కనిపించింది. బాటకు ఇరుప్రక్కలా ఉన్న పల్లపు చేలనుండి బాటపైకి ఎక్కి వస్తున్న కర్షకులు పాడుతున్న ఏవేవో పాటల సన్నని కూని రాగాలు వినబడీ వినబడకుండా గాలివాలుకు అతనికి చెవులకు సోకుతున్నాయి. ఎందుకో వేగం మందగించి నిదానముగా ముందుకు సాగడం ప్రారంభించింది అశ్వము. ఒక్కసారిగా మంత్రం వేసినట్టు ప్రకృతి నిశ్చలమైపోయినట్టు గాలి స్తంభించినట్లు తలలూపుతున్న చెట్లు నిశ్చలమై పోయాయి. ఎగురుతున్న ఆకులూ గడ్డిపరకలు అలాగే గాలిలో నిలిచినట్లు నిలిచి నెమ్మదిగా నేలకు రాలిపోయాయి. ఏదో మంత్రకట్టు పడినట్టు హఠాత్తుగా ఆగిపోయి నిలువెల్లా సంచలించిపోయింది ఆ అశ్వము. ఆ వుదుటుకు తన

అనుభవాన్ని శరీరబలాన్ని ఒక్కటిగా జోడించి కూడగట్టుకున్నాడు ఆ అశ్వికుడు. ఎడమ చేతితో కళ్ళాలను పూర్తిగా లాగి వొడిసి పట్టుకుని, రెండు కాళ్ళనూ రికాబులలో తన్నిపట్టి క్రిందపడిపోకుండా తనను నియంత్రించుకున్నాడు.

ముందుకు వాలి కొండశిఖరంలాగా దీర్ఘమైన బలమైన ఆ అశ్వపు మెడను కుడి చేతితో పెనవేసి కౌగిలించుకుని, మృదువుగా తడుతూ దాని దారికేదయినా క్రూరమృగము అడ్డంగా వచ్చిందా అనే అనుమానముతో పరిశీలనగా కలయజూశాడు.

ఆతని ఎడమప్రక్కన బాటకు అనుకుని పెరిగిన పొదలలో హిస్సుమని ఒక సన్నని ధ్వని వినవచ్చింది. మరుక్షణంలో ఒక నల్లని మెరుపు మెరిసింది. ఈ రెండిటినీ అతని మస్తిష్కము గుర్తించే లోపే ఎక్కడినుండి, ఎలా వచ్చిందో, తెలియకుండా ఆకాశమునుండి వూడిపడ్డ కాలపాశములా నల్లగా మెరుస్తూ తోక మీద నిలువునా నిల్చి కనుల ఎదురుగా భయంకరముగా ప్రత్యక్షమైంది పదిహేను మూరల పొడవైన మహా కాల సర్పము.

అస్తమిస్తున్న సూర్యుని సిందూర వర్ణము దానిమీద ప్రతిఫలించి మరింత నల్లగా మెరుస్తున్నది. విశాలమైన పడగను ఊపుతూ ఎప్పటిదో పురాతనమైన కసి గూడుకట్టుకున్నట్లు, గుర్తు పట్టినట్లు అంతకంతకూ తీవ్రముగా సంచలిస్తున్నది. ముదురు ఆకుపచ్చరంగులో ఉన్న క్రూరమైన కనుగుడ్ల పై ఎఱ్ఱని సూర్యకాంతి ప్రతిఫలిస్తూ మరింత భయం గొల్పేలా ఉన్నది. దవడలు పూరించి హిస్సుమని అది కొడుతున్న బుసలతో కూడిన వేడి గాలి తగులుతున్నది ఆ అశ్వానికి. ఆరడుగుల పైచిలుకు ఎత్తు కలిగిన బలిష్టమైన ఆ అశ్వము భయముతో బిగ్గరగా సకిలిస్తూ ముందు రెండు కాళ్ళూ పైకెత్తి వెనుక కాళ్ళమీద పూర్తిగా నిలబడింది ఒకే ఒక క్షణం.

ఆరడుగుల దూరంలో భయంకరంగా వూగుతున్న ఆ కృష్ణ సర్పపు పడగ ఇంకా ఆరు మూరల ఎత్తున ఉన్నది. తీవ్రమైన కోపముతో బుగ్గలు పూరించినపుడల్లా విశాలమైన పడగ మరింత పొంగుతున్నది. ఒక చిన్న తాడి చెట్టంత పొడవుతో, తాడి మొదలు వంటి నల్లని బలమైన లావైన శరీరముతో ఊగిపోతున్న ఆ మహా సర్పాన్ని చూస్తూ చేష్టలుడిగి పోయాడు అశ్వికుడు.

జానపద కథలలో విన్నదే కానీ ఎన్నడూ చూసి ఎరుగని ఆ అనుభవానికి క్షణకాలం నివ్వెరపోయి, కనులు వెళ్ళబెట్టి చూస్తుండిపోయిన ఆ మరాఠా యోధుడి కుడిచేయి మరుక్షణంలో ఆ నల్లత్రాచుకన్నా వేగముగా కదిలింది. ఒరలోనున్న ఖడ్గాన్ని మెరుపులా దూసి, కళ్ళాలను బలంగా లాగి అశ్వాన్ని ఎడమప్రక్కకు దూకించాడు. బలిష్టమైన చేయిని పైకెత్తి తన పొడవైన ఖడ్గాన్ని మెరుపులా విసిరాడు. ఇంద్రజాలంలా కనురెప్పపాటులో నేర్పుగా పడగను దించి పూర్తిగా నేలకు వాలింది ఆ మహాసర్పము. దాని పడగపైనుంచి గాలిని చీల్చుకుంటూ గుండ్రముగా తిరిగివచ్చింది ఆతని చేయి. ఒక్కవూపుతో పక్కకుదూకి ఆ సర్పమును గమనించడానికి తల తిప్పిన అశ్వపు దవడలకు తగిలింది. పిడిపై అతడి పట్టు సడలి ఖడ్గము జారిపడింది. జారిపోతున్న ఖడ్గమును అందుకునే ప్రయత్నములో ముందుకు వంగాడు అశ్వికుడు. అనుకోని దృశ్యానికి భయపడిన అశ్వము అతని బలమైన చేయి తగలడంతో కంగారుపడి ఒక్కసారిగా ముందుకు దూకింది. ఆ వుదుటుకు రికాబులలో కాళ్ళపట్టు తప్పింది. మూటలా నేలకు జారి దబ్బున కుప్పకూలాడు అశ్వికుడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS